
అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్
విచిత్ర బంధం
నిర్మాత:
D. మధుసూదనరావు
దర్శకుడు
ఆదుర్తి సుబ్బారావు
1972

PADMA

కథ: మంచితనం మనుష్యుల విలువల్ని పెంచుతుంది. అహం భావం మనిషి పతనానికి కారణ మవుతుంది. ఎంత మంచి వ్యక్తి అయినా క్షణికావేశంలో తప్పు చేయటం సహజం. తప్పు చేయడంలో మానవుడిలోని రాక్షసత్వం బయటపడితే చేసిన తప్పును దిద్దుకోవడంలో దైవత్వం ప్రకటితమవుతుంది.

అగర్భ శ్రీమంతుడు నారాయణరావు ఏకైక కుమార్తె సంధ్య. చిన్నప్పుడే తల్లి పోవడంతో మేనత్త శాంతమ్మ అలన పాలనలో పెరిగింది. అయితే పట్టుదల అహంభావం మూర్తీభవించిన సంధ్యకు తమ్ముడు వాసు అంటే పంచప్రాణాలు.

సంధ్య తనకు ప్రేమలేఖ వ్రాసిన బాబ్జీని అవమానపరచడమే కాకుండా కాలేజినుండి సస్పెండ్ చేయించింది. అన్యాయాన్ని సహించలేని మాధవ్, మిత్రునికి జరిగిన అవమానానికి సంధ్యచేత బలవంతంగా క్షమాపణ చెప్పించాడు.

మాధవ్‌మీద పగబట్టిన సంధ్య యుక్తిగా యింటికి పిలిపించి అవమానపరచింది. విచిత్ర పరిస్థితులలో మాధవ్, సంధ్యలు కలుసుకున్నారు. సంధ్య అహంభావంతో మాధవ్ అభిమానం దెబ్బ తిని ఒక తొందరపాటు పనికి దారితీసింది. పశ్చాత్తాపపడ్డ మాధవ్ తన తప్పు దిద్దుకోటానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయి పోయాయి.

ప్రకృతి తన ప్రభావాన్ని సంధ్యమీద ప్రసరించింది. కన్యగానే తల్లి అయ్యే సూచనలు కనిపించాయి. సంధ్య తండ్రి అకస్మాత్తుగా చని పోవడంతో ఓడలు బళ్లయినాయి. మాధవ్ తాతగారి వ్యాధి చికిత్స కోసం విదేశాలకు వెళ్ళవల్సి వచ్చింది. సంధ్యకు పుట్టిన బిడ్డను ఆమెకు తెలియకుండా ఒక క్రైస్తవ మతాధికారికి అప్పగించిన శాంతమ్మ సంధ్య, వాసులతో ఒక పల్లెకు చేరుతుంది.

నాలుగు సంవత్సరాల తరువాత తిరిగి వచ్చిన మాధవ్ సంధ్యను ఎలా కల్సుకోగలిగాడు ?

కరుడు కట్టుకుపోయిన సంధ్య మనస్సును మాధవ్ ఎలా మార్చ గలిగాడు ?

విభిన్న దృక్పథాలతో వేరువేరుగా పయనిస్తున్న మాధవ్ సంధ్యల కలయికే విచిత్రబంధం.

1 రచన : ఆచార్య ఆత్రేయ
పాడినవారు: ఘంటసాల - సుశీల & బృందం



సంధ్య : చీకటి వెలుగుల రంగేళి
జీవితమే ఒక దీపావళి - మన
జీవితమే ఒక దీపావళి
మాధవ్: అందాల ప్రమిదల ఆనంద జ్యోతుల
ఆశల వెలిగించు దీపాలవెల్లి
వాసు : అక్కయ్య కన్నుల్లో మతాబులు
మాధవ్: ఏ చక్కన్ని బావకో జవాబులు
మాటల్లో వినిపించు చిటపటలు
సంధ్య : ఏ మనసునో కవ్వించు గుసగుసలు
మాధవ్: అల్లుళ్లు వస్తారు అత్తవారిళ్ళకు
సంధ్య : మరదళ్లు చేస్తారు మర్యాద వాళ్ళకు
వాసు : బావ బావ పన్నీరు - బావను పట్టుకు తన్నేరు
సంధ్య : వీధి వీధి తిప్పేరు - వీసెడు గుద్దులు గుద్దేరు
మాధవ్: అమ్మాయి పుట్టింది అమాసనాడు
అసలైన గజదొంగ అవుతుంది చూడు
సంధ్య : పుట్టినరోజున దొరికాడు తోడు
పున్నమినాటికి అవుతాడు జోడు

2 రచన : ఆచార్య ఆత్రేయ
పాడినవారు: ఘంటసాల - సుశీల & బృందం

మాధవ్: భళి భళి వినరా ఆంధ్రకుమారా భాగ్యనగర్ గాథ
కోరస్ : మన రాజధాని గాథ
సంధ్య : వలపులవంతెన మూసీ నదిపై వెలసినట్టి గాథ
కోరస్ : మన రాజధాని గాథ
మాధవ్ : గోలుకొండను ఏలుచుండెను గొప్పగమల్కిభరాం
కోరస్ : గొప్పగ మల్కిభరాం
మాధవ్ : అతని కొడుకు అందాల రాజు కులీ కుతుబ్‌షా
కోరస్ : కులీ కుతుబ్ షా
సంధ్య : చంచలపల్లెను వసించుచుండెను నర్తకి భాగమతి
కోరస్ : నర్తకి భాగమతి
సంధ్య : సరసుడు యువరాజామెనుచూసి మనసునిచ్చినాడు
కోరస్ : తందాన తాన తానతందనాన

కులీకుతుబ్‌షా :
కలల జల్లుల కారుమబ్బులు కాటుకలద్దిన కన్నులు
మబ్బు విడిచిన చంద్రబింబము మగువ చక్కని వదనము
మెల్లమెల్లగ హృదయ వీణను మీటగలవీ లేతవేళ్లు
ఘల్లు ఘల్లున గుండె ఝల్లన కదలి ఆడును కన్నెకాళ్లు

Printed by RADHA OFFSET PRESS, Madras-13.

భాగమతి : అందరి కన్నులు నామీద, నా కన్నులు మాత్రం నీమీద,
నీమీద, నీమీద, నీమీద, కాసులు విసిరే చేతులకన్నా
కలసి నడిచే కాళ్ళేమిన్న, మనుగడకోసం పాడుతువున్నా
మనసున నిన్నే పూజిస్తున్నా ||అందరి||
భాగ : నింగివి నీవు
కులీ : రంగుల హరివిల్లు నీవు
భాగ : పూర్ణిమ నీవు
కులీ : ఫొంగే కడలివి నీవు, నీ మువ్వలలో
భాగ : నీ నవ్వులలో
కులీ : మురిసింది మూసీ
భాగ : విరిసింది నీ ప్రణయదాసి ||అందరి||
భాగమతి : రారా నా ప్రియతమా, రారా నా హృదయమా
నా వలపే నిజమైతే ఈ పిలుపు నీవు వినాలి ||రారా||
నేనీ యిలలోన - నువ్వా గగనాన
మూసీనది చేసినది ప్రళయ గర్జన
పెను తుఫాను వీచినా, ఈ ప్రమిద ఆరిపోదురా
వరద వచ్చి ముంచినా, ఈ బ్రతుకు నీది నీదిరా ||రారా||
మాధవ్ : పిలుపును విన్న యువరాజు, పెటపెటలాడుచు లేచెను
ఎదురైన పహరావారిని, ఎక్కడికక్కడ కూల్చెను
ఉరుముల మెరుపుల వానల్లో, ఉరికెను మూసీ నదివైపు
సంధ్య : ఆవలి ఒడ్డున భాగమతి
మాధవ్ : ఈవల ప్రేమ సుధామూర్తి
సంధ్య : ప్రియా
మాధవ్ : ఓ ప్రియా
ఇద్దరు : ప్రియా ప్రియా ఓ ప్రియా ప్రియా, అను పిలుపులు దద్దరిల
వరద నెదిర్చి వలపు జయించి, ఒదిగిరి కౌగిలిలో.
మాధవ్ : మల్కిభరామా పవిత్రప్రేమకు, మనసు మారిపోయి
సంధ్య : చార్మినారూ పురానపూలు, చరితగ నిర్మించె
మాధవ్ : భాగమతి పేరిట వెలసెను, భాగ్యనగరమపుడు
సంధ్య : భాగమతీ పేరిట వెలసెను భాగ్యనగరమపుడు
కోరస్ : మన రాజధాని యిపుడు - మన రాజధాని యిపుడు

3 రచన: దాశరథి
పాడినవారు: సుశీల, రామకృష్ణ

సంధ్య : వయసే ఒక పూలతోట, వలపే ఒక పూలబాట
ఆ తోటలో ఆ బాటలో
ఇద్దరు : పాడాలి తియ్యని పాట
మాధవ్ : పాలబుగ్గలు ఎరుపైతే లేత సిగ్గులు ఎదురైతే
సంధ్య : రెండు మనసులు ఒకటైతే, పండు వెన్నెల తోడైతే
మాధవ్ : కోరికలే తీరేనులే



ఇద్దరు : పందారి వలపుల పంట
మాధవ్ : నీ కంటి కాటుక చీకటిలో, పగలు రేయిగ మారెనులే
సంధ్య : నీ కొంటెనవ్వుల కాంతులలో, రేయి పగలైపోయెనులే
మాధవ్: నీ అందము నా కోసమే
ఇద్దరు : నీ మాట ముద్దుల మూట
మాధవ్ : పొంగిపోయే పరువాలు, నింగినంటే కెరటాలు
సంధ్య : చేరుకున్నవి తీరాలు, లేవులే ఇక దూరాలు
మాధవ్ : ఏనాటికి మన మొక్కటే
ఇద్దరు : ఒకమాట ఇద్దరినోట

4 రచన : కొసరాజు
పాడినవారు : రామకృష్ణ

మాధవ్ : చిక్కావు చేతిలో చిలకమ్మా-నీవు
ఎక్కడికీ పోలేవు ఆగవమ్మా
నీ కోరచూపు చూచి-బెదరి పోదునా
కస్సు బుస్సు మనగానే-అదిరిపోదునా
పొగరంతా అణిగిందా-బిగువంతా తగ్గిందా
తప్పు ఒప్పుకుంటావా-చెంపలేసుకుంటావా ॥చిక్కావు॥
కల్లబొల్లి మాటలతో కైపెక్కిస్తావా
హొయలు వగలు చూపించీ వల్లో వేస్తావా
నాటకాలు ఆడేవా నవ్వులపాలు చేశేవా
నీ టక్కులు సాగవమ్మా నీ పప్పులు ఉడకవమ్మా ॥చి॥
మోసాన్ని మోసంతోటే పందెమేసి గెలిచాను
వేషానికి వేషంవేసీ ఎదురుదెబ్బ తీశాను
గర్వాన్నీ వదిలించీ కళ్లు బాగా తెరిపించీ
కాళ్ళ బేరానికి నిన్నూ రప్పించాను ॥చిక్కావు॥

5 రచన : ఆచార్య ఆత్రేయ
పాడినవారు : ఘంటసాల - సుశీల



అందమైన జీవితము అద్దాల సౌధము
చిన్నరాయి విసిరినా చెదరిపోవును
ఒక్క తప్పు చేసినా ముక్కలే మిగులును ॥అందమైన॥
నిప్పువంటి వాడవు తప్పుచేసినావు. ఎంత తప్పు చేసినావు
క్షణికమైన ఆవేశం మనసునే చంపింది, నిన్ను పశువుగా మార్చింది
నీ పడుచుదనం దుడుకుతనం పంతాలకి పోయింది
పచ్చనైన నీ బ్రతుకును పతనానికి లాగింది
నిన్ను బలిపశువును చేసింది ॥అందమైన॥
ఎవరిది ఈ నేరమని ఎంచి చూడదు, లోకం ఎంచి చూడదు
ఏదో పొరపాటని మన్నించదు. నిన్ను మన్నించదు
అరిటాకు వంటిది ఆడదాని శీలము
ముల్లు వచ్చి వాలినా-తాను కాలు జారినా
ముప్పు తనకె తప్పదు-ముందు బ్రతుకె వుండదు ॥అందమైన॥



6 రచన: దాశరథి
పాడినవారు: ఘంటసాల, సుశీల

మాధవ్ : చల్లని బాబూ నా అల్లరి బాబూ
నా కంటి పాపవు నీవే
మా యింటి దీపం నీవే
పంచవన్నెల రామచిలకను
పలకరించబోయేవు
వింతచేష్టల కోతుల చూసి
గంతులెన్నో వేసేవు
నీ పలుకులు వింటూ పరుగులు
చూస్తూ పరవశమైపోతాను

సంధ్య : బాబూ ! చల్లని బాబూ,
నా అల్లరి బాబూ
నా కంటిపాపవు నీవే-మా
యింటి దీపం నీవే
ఎన్నెన్నో ఆశలతోటీ
ఎదురు చూస్తూవున్నాను
వెచ్చని ఒడిలో నిన్నుదాచి
ముచ్చటలెన్నో చెబుతాను
అమ్మా నాన్నల అనురాగంలో
అపురూపంగా పెరిగేవు ॥చ॥

మాధవ్ ప్రతిబింబం :
నీ బాబును తల్లి ఆదరించునని
భ్రమపడుతున్నావా
చితికిపోయిన మగువ మనసులో
మమతలు వెతికేవా.
నీవు చేసిన అన్యాయాన్ని
మరచిందనుకున్నావా
నీ ఆలోచనలు అనుబంధాలు
అడియాసలుకావా ॥చల్లని॥

7 రచన: ఆచార్య ఆత్రేయ
పాడినవారు: ఘంటసాల - సుశీల

సంధ్య : చీకటి వెలుగుల రంగేళీ
జీవితమే ఒక దీపావళీ
ఈ జీవితమే ఒక దీపావళీ
మాధవ్ : అందాల ప్రమిదల-ఆనందజ్యోతుల
సంధ్య: అణగార్చితెలవారుఅమవాసరేయి ॥చీ॥
వాసు : అక్కయ్య కన్నుల్లో మతాబులు
సంధ్య : అవి అణగారి మిగిలాయి కన్నీళ్లు
మాధవ్ : కలకాలం వుండవు ఈ కలతలు
కన్నీళ్లే కాగలవు చిరునవ్వులు ॥చీ॥
సంధ్య : చితికిన బ్రతుకున చిరునవ్వు రాదు
ముగిసిన కథమార్చి విధివ్రాయబోదు
మాధవ్ : గతమునుమరచిబ్రతుకునుప్రేమించు
విధినెదిరించిసుఖమునుసాధించు ॥చీ॥

8 రచన: అచార్య ఆత్రేయ
పాడినవారు: సుశీల

సంధ్య : అమ్మా, అమ్మా అని పిలిచావు - ఆ
కమ్మనైన పిలుపుతో కట్టేశావు
ఏ తల్లి కన్న బాబువో - నా
కాళ్ళకు బంధం అయినావు
ఎవరికీ మనసివ్వని దానను
ఏ మమతకూ నోచుకోని బీడును
మోడులా యీబ్రతుకును మోశాను
నీ ముద్దుమోము చూచి మరల
మొలకెత్తాను ॥అమ్మా॥
కన్నతల్లి ఎవ్వరో ఎరుగవు నువ్వు
కడుపు తీపి తీరని తల్లిని నేను
కాలమే ఇద్దరినీ కలిపింది ఎందుకో
ఒకరి కొరత నింకొకరు
తీర్చుకునేటందుకో ॥అమ్మా॥

నటీ నట వర్గం

కుమారి వాణిశ్రీ	పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు
శ్రీమతి అంజలి	గుమ్మడి
శ్రీమతి సూర్యకాంతం	యస్. వి. రంగారావు
కుమారి లీలారాణి	వి. నాగయ్య
శ్రీమతి రమాప్రభ	అల్లు రామలింగయ్య
శ్రీమతి రాధాకుమారి	పద్మనాభం
వై. విజయ	రాజబాబు

మాస్టరు ఆదినారాయణ, మాస్టరు రమేష్‌బాబు

సాంకేతిక నిపుణులు

కథ : శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి (విజేత)

స్క్రీన్ ప్లే : ఆదుర్తి సుబ్బారావు, దుక్కిపాటి మధుసూదనరావు

మాటలు : ఆచార్య ఆత్రేయ

పాటలు : ఆత్రేయ, కొసరాజు, దాశరధి

సంగీత దర్శకుడు: కె.వి.మహదేవన్

ఛాయాగ్రహణ దర్శకుడు : పి. యస్. సెల్వరాజ్

ప్లేబాక్ : పి. సుశీల, ఘంటసాల, రామకృష్ణ

శబ్దగ్రహణ దర్శకుడు : ఏ. కృష్ణన్, బి.ఏ.

సాంగ్ రికార్డింగ్ & రీ రికార్డింగ్ : పి. వి. కోటేశ్వరరావు (జెమిని)

మాటల రికార్డింగ్ : జి. గోఖలే

కళాదర్శకుడు: జి.వి.సుబ్బారావు,బి.ఏ.

నృత్య దర్శకులు : హీరాలాల్, సుందర్

ఎడిటింగ్ : యం. యస్. మణి

మేకప్ : చౌదరి

కాస్ట్యూమ్సు : జీనార్దు, బోదులు

స్టిల్సు : యం. సత్యం (జైహింద్ స్టూడియోస్)

పబ్లిసిటీ : ఈశ్వర్

ప్రెస్ పబ్లిసిటీ : N.V.K.R.


స్టూడియో : శ్రీ సారధి స్టూడియోస్, హైదరాబాద్

ప్రోసెసింగ్ : జెమినీ కలర్ లేబరేటరీస్, మద్రాసు

అసోసియేట్ దర్శకుడు : కె. రామిరెడ్డి, B.Sc., D.C.

సహ నిర్మాతలు : జి. ప్రసాద్, బి.ఏ. — పి. గంగాధరరావు, బి. ఇ.

అన్నపూర్ణ పిలింస్ రిలీజ్


విచిత్రబంధం కథ-పాటలు - వెల [illegible] పై॥